క్లుప్తంగా

బార్..బెంచ్‌ల మధ్య సహకారం అవసరం



జడ్జి శ్రీనివాస్‌కు బొకే అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): కోర్టుల్లో బార్ అసోసియేషన్, బెంచ్‌ల మధ్య సహకారం ఎంతో అవసరమని మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజు పేర్కొన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో బదిలీపై వచ్చిన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సూరిబట్ల శ్రీనివాస్‌ను స్వాగతం పలుకుతూ సీనియర్ న్యాయవాదులు బొకేలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జ్ తంగమని, రెండో అదనపు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కిరణ్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏసురత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్ బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కృష్ణారెడ్డి, మద్దిలేటిరెడ్డి, చిన్న లింగమయ్య, రాజేశ్వర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ప్రతిభా అవార్డు



అవార్డు అందుకున్న రామలింగం

నంద్యాల(న్యూటౌన్): గురురాజ విద్యాసంస్థల ఉపాధ్యాయుడు కొత్రపోలు రామలింగంకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు వరించింది. ఈ విషయాన్ని గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్, కేవీఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరులోని లామ్ చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గత నెల 31వ తేదీన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగిందన్నారు. అవార్డు గ్రహీత 16 సంవత్సరాలుగా గురురాజ విద్యాసంస్థలో ఇంగ్లిష్ బోధన చేస్తున్నారన్నారు.

భూ సమస్యలపై వినతులు

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భూ సమస్యలపై అధిక వినతులు వచ్చాయి. వీటిని తహశీల్దార్ సువర్ణాదేవి పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నంద్యాల ఆసుపత్రికి ముగ్గురు ప్రొఫెసర్లు

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వాసుపత్రికి మరో ముగ్గురు ప్రొఫెసర్లు వచ్చారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఆర్థో విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ ఇలియాస్‌బాషా, రేడియాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ హరినాథ్, చిన్నపిల్లల విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ రవీంద్రనాథరెడ్డిని నంద్యాలకు నియమించారు. వీరు సోమవారం విధుల్లో చేరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు సూచించారు. మండల కేంద్రం రుద్రవరం గ్రామ సచివాలయంలో సోమవారం సంచార వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని కేజీబీవీకి వెళ్లి అక్కడి బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదముందని ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్కడి మధ్యాహ్న భోజనం, వంట గది, పరిసరాలను పరిశీలించి ప్రిన్సిపాల్ లక్ష్మీదేవికి పలు సూచనలు చేశారు.

13న అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు

పగిడ్యాల: ఈనెల 13 నుంచి మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర ఆరు పళ్ల విభాగం వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కోరల సుధాకర్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డి జ్ఞాపకార్థం పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ. 35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.





పూర్తిగా దెబ్బతిన్న బోడెమ్మనూరుకు వెళ్లే రహదారి

అడుగడుగునా గుంతలే

బోడెమ్మనూరు గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని నరకప్రాయంగా మారింది. గ్రామ సమీపంలోని కుందూనది వంతెన నుంచి కోవెలకుంట్ల, జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి వరకు 8 కిలో మీటర్ల పొడువున తారు రోడ్డు వేశారు. తర్వాత రహదారి మరమ్మతులకు నోచుకోలేదు. అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారింది. ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రోడ్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు. –ఉయ్యాలవాడ





ఇక్కడ చెత్తతో నిండిపోయి కనిపిస్తున్న డస్ట్ బిన్లు ఎక్కడో ఊరిబయట లేవు. నంద్యాల నడిబొడ్డున ఉన్న జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే ఉన్నాయి. దెబ్బతిన్న ఆరోగ్యాన్ని బాగు చేసుకునేందుకు ఇక్కడికి రోగులు వస్తుంటారు. అయితే, ఈ ఆసుపత్రి పరిసరాలను చూస్తే రోగం నయం దేవుడెరుగు లేని జబ్బులు వచ్చేలా ఉన్నాయి. ఎక్కడ చూసినా తిని పడేసిన వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారమే కనిపిస్తోంది.ఆసుపత్రి ఆవరణలో అక్కడక్కడా చెత్త కుండీలు ఏర్పాటు చేశారు కానీ వాటిలో వేసిన వ్యర్థాలు తొలగించడం లేదు. దీంతో అక్కడ కుక్కలు చేరి పరిసరాలను మరింత కలుషితం చేస్తున్నాయి. రోగాలు దరిచేరరాదంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పే వైద్యాధికారులకు ఈ అపరిశుభ్రత కనిపించడం లేదా అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. –గోస్పాడు

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి
- అధికారులకు జిల్లా జాయింట్ ఆదేశం



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని, వాటి పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై జేసీ అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టరాదన్నారు. బాధితులకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. వారు ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి పీజీఆర్ఎస్‌కు వస్తుంటారనే విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ వారికి అర్థమయ్యేలా స్పష్టంగా ఇవ్వాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువు లోపల పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ దృష్టికి వచ్చిన వినతుల్లో కొన్ని..

- మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన బోయ వెంకటసుబ్బయ్య మండలంలో ఉన్న అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించి నిజమైన రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని జేసీని కోరారు.
- డోన్ చెందిన ఎస్.గంగాధర్ తనకు సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్నానని గృహనిర్మాణ పథకం ద్వారా తనకు స్థలం మంజూరు చేసి నిర్మాణానికి సహకరించాలని విన్నవించారు.
- రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు రేషన్ కార్డు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నానని, స్పందించి రేషన్ కార్డు మంజూరు చేయించాలని జేసీని కోరారు.

బాలల్లో సృజనాత్మకతకు పదును



కళార్చన పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): కళార్చన పోటీలు బాలల్లో సృజనాత్మకతకు పద్దును పెడుతాయని డాక్టర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళారాధన నంద్యాల సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి కమిషన్, సాంస్కృతిక శాఖ సహకారంతో మాతృభూమికి కళార్చన పోటీలను రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ పోటీలను డాక్టర్ రామకృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాలలో 25 సంవత్సరాలుగా విద్యార్థుల్లో దేశభక్తి, సృజనాత్మకత పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా అనేక రకాల పోటీలు నిర్వహిస్తుందన్నారు. కళారాధన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ మొదటి రోజు లఘు చలనచిత్ర విశ్లేషణ, చిత్రపట విశ్లేషణ, లేఖా రచన, కవితా రచన, పూర్తిగా తెలుగులో మాట్లాడడం వంటి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. డబ్బు విలువ తెలియజేసి, కష్ట పడితేనే ఫలితం దక్కుతుందని తెలిపే 'విలువ' అనే లఘు చలనచిత్రాన్ని చూసి విద్యార్థులు విశ్లేషణ వ్యాసాలు రాశారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. మొదటిరోజు పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

నేడు, రేపు జరిగే పోటీలు...

రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో మంగళవారం సబ్ జూనియర్, జూనియర్ విభాగాలకు దేశభక్తి, సాధారణ సినీ, జానపద, శాస్త్రీయ పాటల పోటీలు, బుధవారం సీనియర్ కేటగిరీలో వాద్య సంగీతం పోటీలు, ముఖాభినయం, లఘు నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహానందీశ్వరుడి దంపతులకు పల్లకీసేవ

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు అలంకార మండపంలో మహానందీశ్వర దంపతుల ఉత్సవమూర్తులను అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలతో పాటు బలిహరణల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు. రాత్రి 9.30 గంటలకు యాగశాలలో ఏకాంత సేవ పూజలు చేపట్టారు.

10న జాబ్‌మేళా

నందికొట్కూరు: ఈనెల 10న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.సునీత తెలిపారు. సోమవారం అల్లూరు గ్రామంలోని ఎమ్మెల్యే జయసూర్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 ప్రైవేట్ కంపెనీలు జాబ్‌మేళాకు హాజరవుతున్నాయని, పది, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మల్లన్నకు సహస్ర దీపార్చన సేవ





దీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు, స్వామి అమ్మవార్లకు వెండి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

జిల్లాకు 2600 మెట్రిక్ టన్నుల యూరియా

నంద్యాల: ఈనెల 3వ తేది సాయంత్రంలోపు జిల్లాకు 2600 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా అవసరమైన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే యూరియాను పంటలకు అవసరం మేరకే వినియోగించాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

శిరివెళ్ల: మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉదయానంద హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో కంటి డాక్టర్ సౌమ్యారెడ్డి 155 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 30 మందికి దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారణయింది. ఈ కార్యక్రమంలో ఆనంద్ గురూజీ, కండెలాల్ శ్యాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతికి ప్రార్థనలు చేయండి



నంద్యాల బిషప్‌ను సన్మానిస్తున్న సిస్టర్లు



పట్టణంలో ఆరోగ్యమాతను ఊరేగిస్తున్న భక్తులు

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరు ప్రార్థనలు చేయాలని కర్నూలు ఆర్‌సీఎం బిషప్ గోరంట్ల జాన్సెస్, నంద్యాల అధ్యక్ష ఖండం పీఠం బిషప్ సంతోష్ ప్రసన్నరావు అన్నారు. పట్టణంలోని రోమన్ క్యాథలిక్ చర్చి(ఆరోగ్య మాత) దేవాలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆరోగ్యమాత పండుగ వేడుకలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. అమ్మగా ఆరోగ్యమాతగా ఉందనడంలో అతిశయోక్తి లేదన్నారు. వేడుకల్లో భాగంగా ఉదయం 10 గంటకు జపమాల, కర్నూలు పీఠాధిపతులు ఇతర గురువులతో దివ్య బలిపూజ, మధ్యాహ్నం ప్రేమవిందు, సాయంత్రం 4గంటలకు పట్టణంలో ఆరోగ్య మాత తేరు ఊరేగింపు, రాత్రి 7గంటలకు కేజీ జోసెఫ్ విచారణ గురువులతో దివ్య సత్రసాద ఆశీర్వాదం కార్యక్రమం జరిగింది.అంతకు ముందు ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం విశ్వాసులు కేజీ జోసెఫ్‌తో కలిసి కర్నూలు ఆర్‌సీఎం బిషప్ గోరంట్ల జాన్సెస్ నంద్యాల అధ్యక్ష ఖండం పీఠం బిషప్‌గా ఎన్నికైన సంతోష్ ప్రసన్నరావును సత్కరించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కారు రవికుమార్, సంఘ పెద్దలు ప్రకాష్, మిల్లిన్ స్టోర్ కుమార్, ఆంటోనీ, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

26న పెన్షనర్ల సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న రాజగోపాల్

నంద్యాల(అర్బన్): ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎన్నికలు జరుగనున్నట్లు సంఘం మాజీ అధ్యక్షుడు తోటరాజగోపాల్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా పెన్షనర్ల సంఘానికి ఎన్నికలు జరగక పోవడం విచారకరమన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన జరగాలంటే ఎన్నికలు అవసరమని, సభ్యులందరూ ఎన్నికల్లో పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం తీసుకొచ్చే నాయకులను ఎన్నుకోవాలన్నారు. సభ్యులు స్వతంత్రంగా ఓటు వేసి వారికి అవసరమైన నాయకులను గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేకల లింగస్వామి, మల్లారెడ్డి, రామసుబ్బయ్య, రంగనాథుడు, డీకయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల పట్టణ శాఖ అధ్యక్షుడు దేవేంద్రుడు, ప్రధాన కార్యదర్శి మహేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. వీరి ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల పట్టణంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ విజయవాడలో ఏపీసీపీఎస్ఈఏ నిర్వహిస్తున్న పెన్షన్ మార్చ్‌కు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రెండు రకాల పెన్షన్లు అమలు చేయడం ఉద్యోగులపై వివక్షత చూపడమేనన్నారు. ఒకటే సర్వీసు, ఒకటే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు రెండుమూడు రకాల పెన్షన్లు తీసుకుంటున్నప్పుడు 30 సంవత్సరాలుగా సేవ చేసిన ఉద్యోగికి పెన్షన్ రాకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆనంద్, నాగేషులు, రవికుమార్, ప్రసాదరావు, జమీల్, అహమ్మద్, లక్ష్మీదేవి, సురేష్, శ్యాంరాజు, వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చిత్రపటాన్ని బీజేపీ నాయకుల దహనం చేసి నిరసన తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి తల్లిని కించపరిచే విధంగా మాట్లాడిన రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేవారు. అనంతరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, నాయకులు నిమ్మకాయల సుధాకర్, ఉపేంద్రారెడ్డి, లక్ష్మీరెడ్డి, రమేష్, చింతా నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా నాయకులు బాలముని, జయలక్ష్మి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి



నూతనంగా ఎంపికైన రైతు సంఘం నాయకులు

గోస్పాడు: కౌలు రైతులను గుర్తించి వారికి పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు మార్క్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన గోస్పాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పంటలకు ఎరువులు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, రైతుల పట్ల ప్రభుత్వాల విధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వడంతో పాటు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. మండల రైతు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శిగా సురేష్, సహాయ కార్యదర్శిగా ఆనందరావు, ఉపాధ్యక్షుడిగా ఉమామహేశ్వరరెడ్డి, 8 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ కేంద్రాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గోస్పాడు: పట్టణంలోని సంతాన సాఫల్య కేంద్రాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నెరవాటి మల్టీ స్పెషాలిటీ మాతృత్వ ఐవీఎఫ్ కేంద్రాన్ని, ఐకాన్ ఐవీఎఫ్ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతో మందికి సంతానోత్పత్తి చికిత్స చేశారో తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేద వారికి కేంద్రాల్లో రుసుము తగ్గించి సేవలు అందించాలన్నారు. స్కానింగ్ గదిబయట, రిసెప్షన్ సెంటర్ల వద్ద ఐఈసీ బోర్డులు ప్రదర్శించాలని, అలాగే లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని చెప్పారు. రెండు నెలల ముందే కేంద్రాల రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. కార్యక్రమలో డాక్టర్ భరత్, ఇన్‌చార్జ్ డెమో రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా జట్టు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): గత నెల 29 నుంచి 31వరకు నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెవ్వూరు రామధూత ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టు విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలి రెడ్డి సోమవారం స్థానిక గురురాజ పాఠశాలలో ఉమ్మడి జిల్లా జట్టును అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సీనియర్ పురుషుల జిల్లా జట్టు ప్రథమ స్థానం దక్కించుకోవడం ఉమ్మడి జిల్లాకు గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలో 13 జిల్లాల జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, సీనియర్ క్రీడాకారుడు సురేష్‌రెడ్డి, పాఠశాల కో ఆర్డినేటర్ వీరయ్య, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు స్మృతివనంలో వైఎస్సార్ వర్ధంతి

ఆత్మకూరు: పావురాలగుట్ట పరిధిలోని నల్లకాల్వ వైఎస్సార్ స్మృతివనంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి బైకు ర్యాలీగా నంద్యాల టర్నింగ్ వద్దకు చేరుకుని అక్కడి వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. వైఎస్సార్ స్మృతివనం వద్దకు బైకు ర్యాలీగా వెళ్లి దివంగత నేత విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.